సాక్షి తిరుపతి

బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



ప్రజాద్రోహి చంద్రబాబు

తిరుపతిలోని అనేక ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు జరగకుండా ఆపిన ద్రోహి చంద్రబాబు అని డిప్యూటీ మేయర్ ధ్వజమెత్తారు. - 8లో



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. స్వామి వారి దర్శనానికి ఎలాంటి టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల సమయం పడుతోంది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	36	24
తిరుమల	31	21
గూడూరు	37	28
నగరి	37	26

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాలకు బస్సులు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు బస్సులు సిద్ధం చేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లాలోని 11 ఆర్టీసీ డిపో గ్యారేజ్ సూపర్‌వైజర్లు, స్టోర్ సూపర్ వైజర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గ్యారేజ్ సూపర్ వైజర్లు ప్రతి సర్వీస్ కండిషన్‌ను పరిశీలించాలన్నారు. ప్రధానంగా తిరుమల ఘాట్‌లోకి వెళ్లే సర్వీసులు మధ్యలో ఆగకుండా ముందే చెక్ చేసుకోవాలని ఆదేశించారు. మెకానిక్ చీఫ్ ఇంజినీర్ నరసింహులు పాల్గొన్నారు.

అక్టోబర్ 4, 5 తేదీల్లో వెంకటగిరి జాతర



పోలేరమ్మతల్లి ఆలయ ముఖద్వారం

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతర అక్టోబర్ 4, 5 తేదీల్లో రాష్ట్ర పండుగ హోదాలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జాతర ఏర్పాట్లపై బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్షించనున్నారు. జాతర నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు మంజూరు కానున్నాయి. గతంకంటే మిన్నగా జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టనున్నారు. ఇదిలావుండగా పోలేరమ్మతల్లి ఆలయ పాలకవర్గం కమిటీ పదవీకాలం ముగియడంతో నూతన పాలకవర్గం ఏర్పాటు చేసి నూతన ఉత్తేజంతో జాతర నిర్వహించనున్నారు.

మాతాశిశు మరణాల నివారణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో మాతా శిశు మరణాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ డీకే.బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మాతాశిశు మరణాలపై ప్రసూతి మరణ నిఘా, ప్రతిస్పందన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసవ సమయంలో నిబంధనల మేరకు వైద్యపరీక్షలు నిర్వహించాలని చెప్పారు. కమిటీ కన్వీనర్, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, డీఐఓ శాంతకుమారి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థ సారథి, డీసీహెచ్‌ఎస్ ఆనందమూర్తి పాల్గొన్నారు.

● విభిన్నంగా ఆలోచిద్దాం!



తిరుపతి ఐఐటీలో యువ శాస్త్రవేత్తలు, విద్యార్థులు

రేణిగుంట: దేశంలో మున్ముందు మరిన్ని ఆవిష్కరణల వైపు యువ శాస్త్రవేత్తలు అడుగులు వేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో మంగళవారం సైన్స్ అండ్ టెక్నాలజీ మిషన్స్‌పై జాతీయ సదస్సు జరిగింది. తిరుపతి ఐఎస్‌టీఏఫ్, విజ్ఞాన భారతి, తిరుపతి ఐఐటీ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహించాయి. నిపుణులు, మేధావులు పాల్గొన్నారు. యువ శాస్త్రవేత్తలు విభిన్నంగా ఆలోచించి నూతన ఆవిష్కరణలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, ఐఎస్‌టీఏఫ్ అధ్యక్షుడు నారాయణ రావు, విజ్ఞాన భారతి డైరెక్టర్ కొంపెల్ల శాస్త్రి ఈ సదస్సుకు ఏర్పాట్లు చేశారు. నీతి అయోగ్ సభ్యులు పద్మభూషణ్ డాక్టర్ విజయకుమార్ సారస్వత్, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ సెక్రటరీ డాక్టర్ ఎం.రవిచంద్రన్, శాంతా బయోటెక్ ఛైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, డీఆర్‌డీఓ ఈసీఎస్ డైరెక్టర్ జనరల్ బీకే.దాస్ పాల్గొన్నా. సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.కలైసెల్వి వర్చువల్ విధానంలో పాల్గొని ప్రసంగించారు.

● పవిత్ర పరిమళం!



ధ్వజస్తంభాన్ని నీటితో శుద్ధి చేస్తున్న టీటీడీ ఛైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆనందనిలయం మొదలుకుని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉపదేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. శుద్ధి అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. – తిరుమల

ఆరోగ్య అభయం!



ప్రజారోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఆస్పత్రుల్లో అత్యాధునిక వసతులు.. పరికరాలను సమకూర్చింది. అవసరాలకు తగ్గట్టు వైద్యసిబ్బందిని నియమించింది. రోగులకు 24/7 సేవలందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తుల సమగ్ర వివరాలను సేకరించేందుకు ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం చుట్టింది. వలంటీర్ల ద్వారా పక్కాగా సర్వే చేయించేందుకు సన్నద్ధమవుతోంది. అనంతరం హెల్త్ క్యాంపులు నిర్వహించి బాధితులకు చికిత్సలందించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది.

- ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- హెల్త్ క్యాంపుల ద్వారా పక్కాగా చికిత్స
- జగనన్న ఆరోగ్య సురక్ష అమలుకు పకడ్బందీ చర్యలు
- 15 నుంచి క్షేత్రస్థాయిలో వలంటీర్ల సర్వే
- మళ్లీ రంగంలోకి ఫ్రంట్‌లైన్ వారియర్స్
- 30 నుంచి వైద్యశిబిరాల నిర్వహణ
- ఉచితంగా పరీక్షలు, మందుల పంపిణీ

సాక్షి, తిరుపతి డెస్క్ : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. కోవిడ్ సమయంలో విశేష సేవలందించిన ఫ్రంట్‌లైన్ వారియర్స్‌ను మళ్లీ ముందుకు తీసుకువస్తోంది. ఇంటింటికీ ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించి, వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పక్కాగా సర్వే చేపట్టి వ్యాధుల కట్టడికి ఈ నెల 15వ తేదీ నుంచి ఆపరేషన్ ప్రారంభించనుంది. సర్వే పూర్తయిన తర్వాత ఈ నెల 30వ తేదీ నుంచి అన్ని మండల కేంద్రాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది.

విప్లవాత్మకమైన మార్పులు

రాష్ట్రం వైపుగా యావత్ దేశం చూసేలా ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు అనే సంస్కరణలు ప్రవేశపెట్టింది. గ్రామీణప్రాంతాల్లోని వారికి సైతం ఆధునిక చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించింది. ఆరోగ్యశాఖలో వేలాది ఖాళీ పోస్టులను భర్తీ చేసింది. పీహెచ్‌సీలను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దింది. రోగుల వద్దకే వైద్యం అందించేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను పకడ్బందీగా అమలు. చేస్తోంది. ఈ క్రమంలోనే జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట మరో బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. పట్టణాలు, పల్లెల్లో ప్రతి ఇంటికీ వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించి, మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టింది. ఇంటింటి సర్వేలో డెంగీ, మలేరియా, యూరిన్, బీపీ, మధుమేహం, హిమోగ్లోబిన్, గర్భిణులకు అవసరమైన పరీక్షలు చేయనున్నారు.



హెల్త్ క్యాంపులు ఇలా..

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఈ నెల 30వ తేదీ నుంచి మండలాల వారీగా మెగా వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఇవి ప్రారంభం కావడానికి ముందే ప్రజల ఆరోగ్య నివేదికలు సిద్ధంగా ఉంటాయి. రోగి పేరు నమోదు చేయగానే మొత్తం సమాచారం తెలుస్తుంది. అధునాతన పరికరాలతో వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేస్తారు. పరీక్షలు, మందులను ఉచితంగానే అందిస్తారు. శిబిరాల్లో 162 రకాల మందులు, 18 రకాల సర్జికల్ వస్తువులు అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యంగా మధుమేహం, క్యాన్సర్, గుండె, కిడ్నీ వాధులుతో బాధపడేవారు, గర్భిణులకు మెరుగైన వైద్యం సేవలు అందించనున్నారు. వైద్యశిబిరాలకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరవనున్నారు. మొత్తం ప్రక్రియను డీఎంహెచ్‌ఓ, ఆరోగ్య శ్రీ కో-ఆర్డినేటర్, తహసీల్దార్, ఎంపీడీఓ, పీహెచ్‌సీ వైద్యులు, సీడీపీఓ, ఎంఈఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

ఉమ్మడి జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి 01	టీచింగ్ ఆస్పత్రులు 02
సీహెచ్‌సీలు 15	పీహెచ్‌సీలు 108
ఏరియా వైద్యశాలలు 07	ప్రైవేట్ హాస్పిటళ్లు 3 వేలకు పైగా
హెల్త్ క్లినిక్‌లు 903	నిత్యం ఓపీ కేసులు 10 వేలకు పైగా

సేవలందించే ఫ్రంట్‌లైన్ వారియర్స్ సమాచారం

స్పెషలిస్ట్ వైద్యులు 549	మెడికల్ ఆఫీసర్లు 258
హెల్త్ అధికారులు 902	ఏఎన్‌ఎంలు 1,333
ఆశ వర్కర్లు 3,247	వలంటీర్లు 21,417

ప్రక్రియ ఇలా..



- జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభిస్తారు
- సర్వేలో భాగంగా వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళతారు
- ప్రజల ఆరోగ్య సమస్యలపై సమగ్ర సమాచారం సేకరిస్తారు
- స్మార్ట్ ఫోన్ ఉన్న వ్యక్తులతో ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తారు
- క్యాంపు వివరాలను తెలియజేస్తారు
- అలాగే ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సైతం ఇంటింటికీ వెళ్లనున్నారు
- ఆయా కుటుంబాల్లోని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు
- పరీక్ష ఫలితాల ఆధారంగా వారి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు
- ఈమేరకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పీహెచ్‌సీల్లో మందులు అందజేస్తారు

వ్యాధుల కట్టడి



సీజనల్ ప్రభావం, జీవనశైలిలో మార్పుల కారణంగా వివిధ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వీటిలో కొన్ని బయటపడకుండా అంతర్గతంగానే వ్యాప్తి చెందుతున్నాయి. చాలా మందికి అవగాహనాలోపంతో పరీక్ష చేయించుకోవడం లేదు. బీపీ, మధుమేహం వ్యాధులను ముందుగా గుర్తించక ఇతర రోగాలు కూడా సోకుతున్నాయి. అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కింద ప్రజల ఆరోగ్య స్థితిగతుల సమాచారం సేకరించి, చికిత్స అందిస్తాం. తద్వారా వ్యాధులను కట్టడి చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం.

– శ్రీహరి, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు. అభీష్ట సిద్ధిరస్తు.

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

శిబిరం చిరునామా:

విశ్వం సైనిక్ అండ్ నవోదయ కోచింగ్ సెంటర్

విశ్వం నగర్, జీవకోన, తిరుపతి

తేది : 16-09-2023 (శనివారం)

సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 96666 97219

ఈ సారి కూడా నా మనవడే సీఎం

- గడప గడపకు కార్యక్రమంలో 85 ఏళ్ల వృద్ధురాలు ఆశీర్వాదం



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న సరోజనమ్మ

వెంకటగిరి రూరల్: 'ఇంటికి పెద్ద కొడుకుగా ఆదుకుంటున్నారు. కష్టాల్లో నేనున్నానని భరోసానిస్తున్నారు. మహిళలు, చిన్నారులు, అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని నేను ఇంతవరకు చూడలేదు. ఈ సారి కూడా నా మనవుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అవుతారు' అంటూ పట్టణంలోని 24వ వార్డు పరిధిలోని 85 ఏళ్ల తోట సరోజమ్మ తెలిపారు. మంగళవారం గడప గడపకు కార్యక్రమంలో భాగంగా వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నెదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి 24వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధురాలు తోట సరోజనమ్మ తన ఆశీర్వచనాలు అందించారు. అదే ప్రాంతానికి చెందిన 67 ఏళ్ల చిప్పల శ్రీనివాసులు మాట్లాడుతూ నేతన్న నేస్తం కార్యక్రమానికి వెంకటగిరి విచ్చేసిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పోలేరమ్మ తల్లి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించడం, ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులపై దృష్టి పెట్టడంతోపాటు వెంకటగిరి అభివృద్ధికి వరాల జల్లు కురిపించారని గుర్తుచేశారు. ఆయన వెంటే వెంకటగిరి ప్రజలు ఉంటారని స్పష్టం చేశారు. అదే ప్రాంతానికి చెందిన గోపాలకృష్ణ మాట్లాడుతూ తమకు సంక్షేమ పథకాలు ఎటువంటి సిఫార్సు లేకుండా అందుతున్నాయని, ఈ ప్రభుత్వ పరిపాలనా విధానం ప్రజలకు సంతృప్తినిస్తోందని తెలిపారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణకు సంబంధించి తొలగించిన ఓటర్ల జాబితా, ఇంటింటి వెరిఫికేషన్, ఎపిక్ కార్డుల ప్రింటింగ్, పంపిణీ తదితర అంశాలపై కలెక్టర్లు, ఈఆర్వోలతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 2022 జనవరి 6వ తేదీ నుంచి తొలగింపు ఓటర్ల జాబితా రీ వెరిఫికేషన్ పూర్తిచేసినట్లు చెప్పారు. పొలిటికల్ పార్టీల నుంచి 52,327 ఫిర్యాదు అందాయన్నారు. ఒకే ఇంటి నంబర్‌పై పది ఓట్లు నమోదుకు సంబంధించి ఈనెల 15వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తామని చెప్పారు. ఇంటింటి సర్వేలో 17,32,797 మంది ఓటర్లకుగాను 26,719 మంది ఓటరుగా నమోదు కాని వారిని గుర్తించినట్లు వెల్లడించారు. తిరుపతి ఈఆర్వో హరిత, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల్ కిషోర్, ఈఆర్వోలు కనక నరసారెడ్డి, కోదండ రామిరెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రముని, శ్రీనివాసులు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సురేష్ పాల్గొన్నారు.

రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్



తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం: తిరుపతిలోని హీరోహోండా షోరూం ఎదురుగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రూ.12.23కోట్లు మంజూరు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బ్రిడ్జ్ నిర్మాణానికి రైల్వే మంత్రిత్వ శాఖతో ఎంపీ మద్దిల గురుమూర్తి జరిపిన చర్చలు ఫలించాయి. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి విజ్ఞప్తి మేరకు అండర్‌బ్రిడ్జ్ నిర్మాణానికి ప్రతిపాదన చేయగా.. వాటికి ఆయన ఆమోదం తెలిపేలా కేంద్రంతో సంప్రదింపులు జరిపారు.

వైఎస్సార్ బీమా క్లెయిమ్ దరఖాస్తులపై దృష్టి

తిరుపతి అర్బన్: వైఎస్సార్ బీమా క్లెయిమ్ దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో బీమా క్లెయిమ్ దరఖాస్తుల జాప్యం సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వైఎస్సార్ బీమా క్లెయిమ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి సుశీలాదేవి, డీఎల్‌డీఓలు ఆదిశేషరెడ్డి, వాణి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కృష్ణారెడ్డి, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ పార్థసారథి, డీఎస్పీ నర్సప్ప, ఫోరెన్సిక్ ల్యాబ్ అధికారి రాజశేఖర్, డీఆర్‌డీఏ ఏపీఎం కత్తి ద్రాక్షాయణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మృతుడు రైల్వే కోడూరు వాసి

చిల్లకూరు: మండలంలోని బూదనం టోల్ ప్లాజా దాటిన తర్వాత బైక్‌పై వెళుతున్న వారిని సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో మృతి చెందిన వ్యక్తి రైల్వే కోడూరు వాసిగా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం.. రైల్వే కోడూరుకు చెందిన కోవూరు మోజస్ (55) గూడూరు మండలం, చెన్నూరులోని తన కుమార్తెను చూసుకుని నాయుడుపేటలో ఉన్న మరో కుమార్తెను చూసేందుకు పోటుపాళెంకు చెందిన నవకోటి బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో టోల్ ప్లాజా వద్ద బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మోజస్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు టోల్ ప్లాజా సీసీ కెమెరాల ద్వారా ప్రమాదానికి గురైన పాల ట్యాంకర్‌ను గుర్తించి విచారిస్తున్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి




మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

శ్రీకాళహస్తి: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ సమీపం ఉరందూరు గేటు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం..ఉరందూరు గేటుకు 200 మీటర్ల దూరంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 35-40 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. మృతుడు పచ్చని షార్టు ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీకాళహస్తి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు.

తిరుపతిలో రిజిస్ట్రేషన్లు ఆపిన ద్రోహి చంద్రబాబు



రిజిస్ట్రేషన్ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళికారెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి

- 22ఏని తీసుకొచ్చి వేల కుటుంబాల్లో జీవితాల్లో చీకట్లు
- రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సుగుణమ్మ కుటుంబం ఏం చేసింది?
- 105 ఎకరాల్లో 7,790 మందికి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించిన ఘనత మాదే
- దేశంలోనే తిరుపతిని మహానగరంగా అభివృద్ధి చేస్తాం
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: టీడీపీ హయాంలో తిరుపతిలోని అనేక ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు జరగకుండా ఆపిన ప్రజాద్రోహి చంద్రబాబు అని తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి 10, 11 డివిజన్లలోని తాతయ్యగుంట, సూరప్పకట్ట ప్రాంతాల్లో ప్రజలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తూ మంగళవారం ఆ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళికారెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చేతుల మీదుగా రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో 22ఏను తీసుకొచ్చి 105 ఎకరాల్లోని ఇళ్లను నిషేధిత జాబితాలోకి చేర్చారన్నారు. గడప గడపకూ వెళ్లినప్పుడు వేల మంది ఆ సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, డెప్యూటీ మేయర్‌గా తాను సమస్యను ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినట్టు వెల్లడించారు. ప్రస్తుతం 105 ఎకరాల్లో సుమారు 7,790 మందికి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించిన ఘనత తమదేనని చెప్పారు. గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న సుగుణమ్మ కుటుంబం తిరుపతి ప్రజలకు ఏమి చేసిందని ఆయన నిలదీశారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా, అభివృద్ధిని అడ్డుకోవాలని చూసినా ప్రజల మద్దతుతో దేశంలోనే తిరుపతిని మహానగరంగా అభివృద్ధి చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. తిరుపతిలోని మరికొన్ని ప్రాంతాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని, వాటికి కూడా త్వరలోనే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు భూమన అభినయ్‌రెడ్డిని కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళికారెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డితో కలిసి స్థానికులు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, తొండమనాటి వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

67వ స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ అండర్-14, 17 కేటగిరిలో తిరుపతి అర్బన్ మండలం, నియోజకవర్గ స్థాయిలో బాలబాలికలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్ 14, 17 తిరుపతి జిల్లా కార్యదర్శి పీ.విజయకుమారి తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 22న ఎమ్మార్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఖోఖో, కబడ్డీ, 23న ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో వాలీబాల్, త్రోబాల్, 26, 27 తేదీల్లో ఎస్పీజేఎన్ఎం నగరపాలక హైస్కూల్లో యోగా, అథ్లెటిక్స్, 29న శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షటిల్ బ్యాడ్మింటన్, 30న ఎంజీఎం నగరపాలక హైస్కూల్లో టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు జరుగుతాయని తెలిపారు. అండర్-14కు 01-01-2010 తరువాత, అండర్-17కు 01-01-2007 తరువాత జన్మించిన బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. బాలబాలికలు తప్పనిసరిగా అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకునేలా ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే మిడ్ డే మీల్స్ అక్విటెన్స్‌ను తప్పక తీసుకురావాలని ఆమె సూచించారు. ఆయా తేదీల్లో ఉదయం 8గంటల్లోపు క్రీడాకారులు రిపోర్ట్ చేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 94415 01649, 98481 73174నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఫ్యాకల్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో గ్రూప్- 2 పరీక్షలకు కోచింగ్ ఇవ్వడానికి అర్హత, ఆసక్తి కల్గిన అనుభవం ఉన్న ఫ్యాకల్టీలను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి చెన్నయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ మేరకు దరఖాస్తులతోపాటు సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో)కి సమర్పించాలని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 9849286037కి సంప్రదించాలని కోరారు.

'పోషకాహార' ఫ్లాష్‌మాబ్!



ఫ్లాష్‌మాబ్‌లో నృత్యం చేస్తున్న మహిళా వర్సిటీ విద్యార్థినులు

తిరుపతి సిటీ: మహిళా యూనివర్సిటీ హోమ్ సైన్స్, పదవ ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థుల చేత ఆకర్షణీయమైన ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహభరితంగా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. నృత్యం ద్వారా ఆరోగ్యకరమైన జీవితం, ఆనందం కలుగుతుందని చెప్పే సందేశాన్ని ఫ్లాష్‌మాబ్ ద్వారా చాటిచెప్పారు. అనంతరం ఆహారాన్ని వృథా చేయడం వల్ల పర్యావరణం, సమాజంపై జరిగే పరిణామాలను విద్యార్థులు సృజనాత్మకంగా చిత్రీకరించారు. పోషకాహార మాసంగా ఈనెలలో జరగబోవు ఈవెంట్లకు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ రజినీ, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు

దామానెల్లూరు విద్యార్థికి బాలరత్న అవార్డు



విద్యార్థికి అవార్డు అందజేస్తున్న ప్రముఖులు

సూళ్లూరుపేట రూరల్: భారత సాంస్కృతిక సమాఖ్య, అర్పిత సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం వేదికగా సోమవారం రాత్రి జరిగిన షనల్ లేవల్ మోగా కల్చరల్ ఈవెంట్ పాటల పోటీల్లో ఉత్తమ సింగర్‌గా సూళ్లూరుపేట మండలం, దామానెల్లూరు గ్రామానికి చెందిన కోగిలి లేవి ఆరధన్(10) ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులా భరణం కృష్ణమోహన్, రిటైర్డ్ ఐఏఎస్ లక్ష్మీకాంతం, ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ కేవీ. కృష్ణకుమారి చేతుల మీదుగా ఉత్తమ సింగర్‌గా ఆంధ్రా బాలరత్న అవార్డు అందుకున్నాడు. ఆరధన్ ప్రైవేట్ పాఠశాలలో నాలుగోవ తరగతి చదువుతున్నాడు. చిన్న వయస్సు నుంచే పాటలంటే మక్కువ పెంచుకున్నాడు. ఆరధన్ తండ్రి కోగిలి శోభన్‌బాబు దొరవారిసత్రం మండలంలోని మావిళ్లపాడు గ్రామంలో ఏపీ మోడల్ స్కూల్ అధ్యాపకులు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 66,199 మంది స్వామివారిని దర్శించుకోగా 29,351 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.17 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

17న బాలుర క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తుమ్మలగుంటలోని వైఎస్సార్ క్రీడా మైదానంలో ఈ నెల 17వ తేదీన అండర్-14 బాలుర జిల్లా జట్టు ఎంపిక పోటీలు జరుగుతాయని చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు 2009 సెప్టెంబర్ ఒకటి నుంచి 2011 ఆగస్టు ఒకటో తేదీ మధ్యలో జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆ రోజు ఉదయం 8 గంటలలోపు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, సొంత క్రీడా సామగ్రి, తెల్లని దుస్తులతో హాజరవ్వాలని తెలిపారు. పూర్తి వివరాలకు 98490 26131, 79818 80381నంబర్లలో సంప్రదించాలన్నారు.

16న ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో వర్సిటీలో ఈ నెల 16వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయిమెంట్ అధికారి టి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేష్విన్, డైకిన్ ఎయిర్‌కండీషనింగ్, క్వాష్ కార్ప్, ది ప్రొఫెషనల్ కొరియర్ కంపెనీ ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని అర్హులను ఎంపిక చేస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు ఎస్వీయూలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సుస్థిర జీవనోపాధే ప్రధాన లక్ష్యం

- వెటర్నరీలో రెండు రోజుల జాతీయ సదస్సు
- అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య

తిరుపతి సిటీ: రైతుల సంక్షేమం, సుస్థిర గ్రామీణ జీవనోపాధి ప్రధాన లక్ష్యం అని, ఆ దిశగా ఎస్వీ వెటర్నరీ కళాశాల విస్తరణ విభాగం పనిచేస్తుందని ఆ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య అన్నారు. మంగళవారం ఎస్వీ వెటర్నరీ కళాశాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. సుస్థిర గ్రామీణ జీవనోపాధి అనే అంశంపై ఈనెల 14, 15వ తేదీల్లో కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రకృతి, వాతావరణంలో మార్పులు, ఆర్థిక, సామాజిక, సాంకేతిక అంశాలపై ఈ సదస్సు దృష్టి సారించనుందన్నారు. ప్రధానంగా ఐదు అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ జీవనోపాధిలో ఎదుర్కొనే సమస్యలు, సవాళ్లు, విధి విధానాలుపై, వ్యవసాయం అనుబంధ శాఖలపై, గ్రామీణ మహిళలు, ప్రభుత్వ పాత్రపై సదస్సు దృష్టి సారిస్తుందన్నారు. అలాగే ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ వంటి విషయాలపై నిశితంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులకు ముఖ్యఅతిథిగా ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వీసీ, పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ గోపాలక్రిష్ణ ద్వివేది హాజరవుతారని తెలిపారు. తమిళనాడు, తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, రాజస్థాన్, కేరళ, గోవా రాష్ట్రాల నుంచి 200 మంది పశువైద్య శాస్త్రవేత్తలు, పలు యూనివర్సిటీల నుంచి వీసీలు, అధ్యాపకులు, విద్యార్థులు, పెద్దసంఖ్యలో హాజరవుతున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో విస్తరణ విభాగాధిపతి డాక్టర్ జీఆర్‌కే శర్మ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ త్రివేణి పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్‌తో అటవీ అధికారులు

భాకరాపేట : తలకోన అడవుల్లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేసినట్టు భాకరాపేట ఫారెస్ట్ రేంజర్ దత్తాత్రేయ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తలకోన నార్త్ బీటులో ఎర్రచందనం స్మగ్లర్ల కదలికలు ఉన్నాయని అందిన సమాచారంతో సోమవారం రాత్రి కూంబింగ్ చేపట్టామన్నారు. తలకోన నార్త్ బీట్ పరిధిలోని కాటుకకనుమ సమీపంలో ఎర్రచందనం దుంగలు మోసుకొస్తున్న స్మగ్లర్లను గుర్తించి వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేశారు. దుంగలు పడేసి పారిపోతుండగా చీకట్లో వెంబండించి ఒకర్ని పట్టుకున్నట్టు వెల్లడించారు. మరో 8 మంది పారిపోయినట్టు తెలిపారు. ఆ ప్రాంతంలో 309కిలోల బరువు గల 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. వీటి విలువ రూ.12 లక్షలు ఉంటుందన్నారు. పట్టుబడ్డ వ్యక్తి తమిళనాడు రాష్ట్రం, తిరువణ్ణామలైకు చెందిన ఆర్.పరుశురామన్‌గా గుర్తించారు. ఈ దాడుల్లో భాకరాపేట, నెరబైలు, సీబీఈటీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా:తిరుపతి జిల్లాలో 104, 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో డ్రైవర్ పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్లు ఎస్వీ.శేషసాయన్నరెడ్డి, వీ.సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులైన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి , మూడేళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తులను అందించాలని పేర్కొన్నారు. 104 సర్వీసులో తిరుపతిలో ఒక పోస్టు, పాపనాయుడుపేటలో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతిలో 7, పుత్తూరు, శ్రీకాళహస్తి, సత్యవేడు, కోట మండలాల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నట్టు వెల్లడించారు. అభ్యర్థులు దరఖాస్తులను తిరుపతి మున్సిపల్ పార్క్ సౌత్ స్ట్రీట్‌లోని 104, 108 కార్యాలయంలో అందజేయాలని కోరారు.

జీ20 మాక్ సదస్సు



వరదయ్యపాళెం మండలంలోని నంతవేలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీ20 మాక్ సదస్సు నిర్వహించారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ఈ సదస్సుపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు మాక్ సదస్సును నిర్వహించినట్లు హెచ్‌ఎం మాధవయ్య తెలిపారు. వివిధ దేశాల ప్రతినిధులుగా విద్యార్థులు వ్యవహరించారు. జీ20 ప్రాముఖ్యత ఆయా దేశాల సంస్కృతి ఆర్థిక పరిస్థితులు, పర్యావరణ స్థితిగతుల గురించి వివరించారు. ఉపాధ్యాయులు అమృత, నరసింహులు, హరినాథరెడ్డి, మనోహర్, స్వామిదాస్, లీలాకృష్ణ, నాగరాజు, దక్షాయణి పాల్గొన్నారు. – వరదయ్యపాళెం